క్లుప్తంగా

వైభవంగా నిత్యకల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

17 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్

పరవాడ: మండలంలోని రెండు గ్రామాల్లో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరిని సోమవారం పరవాడ పోలీసులు అరెస్ట్ చేశారు.

• కలపాక గ్రామానికి చెందిన బొండా గోవింద్ 8 మద్యం సీసాలు పట్టుకుని వెళుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేశారు.

• తానాం గ్రామానికి చెందిన పైల అప్పారావు అక్రమ మద్యం కలిగి ఉన్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ జి.తేజేశ్వరరావు సిబ్బందితో దాడి చేసి అతని నుంచి (180ఎంఎల్) 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

కనీస వేతనాలు అమలు చేయాలని వినతి



ఎంపీడీవో రమేష్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

సబ్బవరం: పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, బకాయి జీతాలు చెల్లించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సోమవారం పలు పంచాయతీల పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తా రాకో నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో రమేష్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. 139 జీవో ప్రకారం కనీసం రూ.26 వేలు జీతం చెల్లించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి సత్యవతి , నాయకులు ఎం గౌరేష్, కోటి, పారిశుధ్య కార్మికులు పెంటారావు, జి. లక్ష్మి, పి కనకమ్మ, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు ఐదు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్‌–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం ఐదు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. జోన్‌–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: నాయుడుతోట 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్‌–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. విరాట్‌నగర్, దుర్గానగర్, గౌతంనగర్, సాయిమాధవ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అంతా.. రామమయం

• అయోధ్య రాముడికి భక్త నీరాజనం
• గ్రామ గ్రామన రామాలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: 'జై శ్రీరామ్' నామస్మరణతో నియోజకవర్గం పులకించింది. అయోధ్యలో జరిగిన చారిత్రాత్మక ఘట్టం రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆధ్యాత్మిక చింతన వెల్లువిరిసింది. రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు తమ భక్తిభావాన్ని చాటుకున్నారు.

• జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి శ్రీకోదండ సీతారామాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పూజలు సోమవారం ముగిశాయి. ఆఖరి రోజు సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం పూర్ణాహుతి ఇచ్చారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఆలయ ప్రధాన అర్చకుడు వజ్జల శ్రీనివాసాచార్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• చినముషిడివాడ శాంతినగర్‌లోని రామాలయంలో అష్టోత్తర కలశాభిషేకం చేశారు. సహస్ర నామార్చన, మంగళ నీరాజనాలు, మంత్రపుష్పం సమర్పించారు.

• రాంపురం, పినగాడి, కోట్నివానిపాలెం, పురుషోత్తపురం, వేపగుంట, సరిపల్లి, సుజాతనగర్, కృష్ణరాయపురం, ముదపాక, ఎస్ఆర్ పురం, జుత్తాడ, గుర్రంపాలెం, గౌరపల్లి, గవరపాలెం, చింతలగ్రహారం, లక్ష్మీపురం, పాత పెందుర్తిలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. రాత్రికి దీపారాధనలు భక్తిశ్రద్ధలతో చేశారు.



సింహగిరిపై స్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహగిరిపై మార్మోగిన నామస్మరణ

సింహాచలం: అయోధ్యలోబాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సీతారాముల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదికపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలను విశేషంగా నిర్వహించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు

పరవాడ మండలంలో..

పరవాడ: అయోధ్య రామయ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా నాయుడుపాలెంలోని సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ధార్మిక జట్టు సహాయంతో భగవంతుడిని పల్లకీలో అధిష్ఠింపజేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పూజారి కూండ్రపు అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, డి.అప్పారావు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

• వాడచీపురుపల్లి రామాలయంలో సోమవారం వేకువ జాము నుంచి రాములవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కె.శ్రీను, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

• పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

• మండలంలో పి.బోనంగి, భర్నికం, తానాం, పెదముషిడివాడ, కన్నూరు, ధావాడ తదితర గ్రామాల్లో అయోధ్య రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.



శాంతినగర్ రామాలయంలో పూజలందుకున్న సీతారాములు

జగదబి రామ.. జానకి రామ

సింహాచలం: బాల రాముడి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి భక్తజనం పరవశించారు. అయోధ్యలోని రామజన్మభూమిలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను కనులారా తిలకించి పులకరించిపోయారు. జై శ్రీరామ్ నామస్మరణలో మునిగితేలారు. దీంతో అంతా రామమయంగా మారింది.

• సింహాచలంలోని సింహాద్రి మఠం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలిపావంచా నుంచి శోభాయాత్ర ప్రారంభించి అడవివరం మీదుగా సింహపురికాలనీలోని రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

• 98వ వార్డు సింహపురికాలనీలోని సీతారామాలయంలో సీతాములకు విశేషంగా పూజలు నిర్వహించారు.

• అడవివరంలోని పాత గోశాల వద్ద ఉన్న సీతారాముల విగ్రహం వద్ద గోశాల నివాసితులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలోని గ్రామ గ్రామాన శ్రీరామ నామస్మరణ హోరెత్తింది. సబ్బవరం, తవ్వవానిపాలెం, నంగినారపాడు, గొల్లలపాలెం, అమృతపురం, బంగారమ్మపాలెం తదితర గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, బాణ సంచాతో గ్రామాల్లో బాల రాముడి చిత్ర పటాలను ఊరేగించారు. మధ్యాహ్నం రామాలయాల వద్ద భారీ అన్న సమారాధనలు జరిగాయి. సాయంత్రం ఇంటింటా దీపాలు వెలిగించి, వేద పారాయణ పఠించారు.



కోదండరాముని ఆలయంలో స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

• తవ్వవానిపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బోకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో సింహాచలం దేవస్థానం వేద పండితులు పాల్గొన్నారు. భారీ అన్న సమారాధనలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. శ్రీనివాస్ గ్రామంలోని రామాలయానికి అవసరమైన పలు రకాల వాయిద్యాలను కొనుగోలు చేసేందుకు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

• నంగినారపాడులో నిర్వహించిన పూజల్లో ఇందలి వెంకటరమణ,ఎర్నిబాబు, , అప్పలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న సురేంద్రస్వామి



తవ్వవానిపాలెంలో బాల రాముడి చిత్ర పటాలను ఊరేగిస్తున్న భక్తులు



గోశాలలో సీతారాముల విగ్రహం వద్ద పూజలు



పల్లకీ సేవలో పెందుర్తి ఎంపీపీ నాగమణి

శివాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ రూ.లక్ష అందజేత

పరవాడ: కలపాక శివారు మూలస్వయంభూవరం గ్రామంలో శివాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విరాళంగా రూ.లక్ష చెక్కును గ్రామ సర్పంచ్ బొండా కనకారావు, ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన ఎమ్మెల్యేకు ప్రజల తరపున సర్పంచ్ కనకారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చుక్క రామునాయుడు, కోన రామారావు, ఇందల రామారావు, గంగిరెడ్ల మోహన్‌రావు, ఈదలపాక నరసింహారావు, కొత్తపల్లి సురేష్, కటారి రాజు తదితరులు పాల్గొన్నారు.



శివాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: జీవీఎంసీ జోన్‌–8 పరిధిలో జీవో ఎంఎస్ నెంబర్ 388 ప్రకారం క్రమబద్ధీకరించిన ఇంటి స్థలాలకు సంబంధించిన పట్టాలను సోమవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ లబ్ధిదారులకు అందజేశారు. వేపగుంటలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి హక్కులు లేకుండా కాలం వెళ్లదీస్తున్న వారికి ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. మొత్తం 662(చినముషిడివాడ 176, పెందుర్తి 294, లక్ష్మీపురం 7, పులగాలిపాలెం 30, వేపగుంట 155) మందికి పట్టాలు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, వార్డు ఇన్‌చార్జి ఆదిరెడ్డి మురళి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బల్ల రాంబాబు, మనాలత జోబ్‌దాస్, నాయకులు మెంటి మహేష్, టి.నర్సింగ్, దాసరి సత్తిబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గుండాలమ్మా.. చల్లగ చూడమ్మా



గుండాలమ్మను దర్శించుకున్న భక్తులు



భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ రెడ్డి వారి పేరంటాలు శ్రీ గుండాలమ్మ తీర్థ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్లు, చిడతలు, కోయడ్యాన్సులు, నేల డ్యాన్సులు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదం అందజేశారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు కాసు అంజిరెడ్డి, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపీ అమ్మలు, మాజీ ఆర్ఈసీఎస్ అధ్యక్షుడు చల్లా కనకారావు, నాయకులు బొద్దపు చిన్నారావు, పోతల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రోత్సాహం అందిస్తున్నారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని చీమలాపల్లి, పాపయ్యరాజుపాలెం, కృష్ణరాయపురం, గొల్లవిల్లివానిపాలెం ప్రాంతాల్లోని లబ్ధిదారులతో కలిసి సోమవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 91 డ్వాక్రా గ్రూపులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.77,36,492 లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 'థ్యాంక్యూ సీఎం సర్..జై జగన్' అంటూ ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీవో కనకరత్నం, టీఎల్ఎఫ్ నాగలక్ష్మి, పార్టీ నాయకులు అయిత ఎర్రయ్య, సంతోష్, బొట్ట రాము, అప్పలరాజు, కృష్ణ, లక్ష్మి, బుజ్జి, చిన్నంనాయుడు, అంగటి సూరిబాబు, ఆకుల వాసు, రాపర్తి సూరిబాబు, మంగమ్మ, వరూధిని పాల్గొన్నారు.



లబ్ధిదారులతో కలిసి థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముమ్మన దేముడు

ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి: రాష్ట్రంలోని ఔత్సాహిక క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని చెప్పారు. వేపగుంటలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో సోమవారం ఆడుదాం ఆంధ్రా కిట్‌లను అదీప్‌రాజ్ క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, వార్డు ఇన్‌చార్జి ఆదిరెడ్డి మురళి, మనాలత జోబ్‌దాస్, దాసరి సత్తిబాబు, పీఈటీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రాథమిక హక్కులపై విద్యార్థులకు అవగాహన

సబ్బవరం: దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీకి చెందిన ప్రో బోనో క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ నగరంలోని డా గార్డెన్స్ జీవీఎంసీఉన్నత పాఠశాల విద్యార్థులకు న్యాయ శిక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్లబ్ చైర్ పర్సన్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక హక్కులను అర్థం చేసుకోడంతో పాటు కనీస న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. వాటిపై అవగాహన కల్పించడానికి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సోషల్ మీడియాలో జరుగుతున్న నేరాలు, గృహహింస, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులు, పోక్సో చట్టం వంటి అనేక ముఖ్యమైన, కొన్ని సున్నితమైన అంశాలను వివరించారు. క్లబ్ సహాయక సభ్యులు భువనేశ్వరి, న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో క్లబ్ చైర్ పర్సన్ సునీత తదితరులు

శ్రమించే ఉద్యోగులకు గుర్తింపు

ఉక్కునగరం: సంస్థ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులకు ఎల్లవేళలా గుర్తింపు లభిస్తుందని స్టీల్‌ప్లాంట్ ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి జె.కె. శర్మ అన్నారు. విభాగంలో 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న టి.ఎ. ప్రసాదబాబును సోమవారం స్టీల్‌క్లబ్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదబాబు సేవలను శర్మ, విజిలెన్స్ అధికారి బి.జోన్స్‌బాబు కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎన్. రావు, జె.మానవేంద్రనాథ్, శ్రీ రమణ, ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్, పి. శ్రీనివాసరావు, కార్మిక నాయకులు ఉండవల్లి శ్రీనివాసరావు, గంగవరం గోపి, ఎన్.వి.పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

మల్కాపురం: తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో దొడ్డి బాబూజీ భార్య, కుమార్తె, కుమారుడితో కొద్దికాలంగా నివసిస్తున్నారు. ఆయన కుమార్తె (16) స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. బాలిక తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో ఈ నెల 21న సాయంత్రం బాలిక బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆమె సోదరుడు అడ్డుకుని తల్లికి చెప్పడంతో ఆమె మందలించారు. దీంతో బాలిక గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. సోమవారం ఉదయం 8 గంటలు అయినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు తలుపు పైభాగంలో అద్దం పగలకొట్టి చూడగా, గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వారు వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాజువాక సీఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1075వ రోజు సంస్థకు చెందిన ఈఎస్ఎఫ్, ఈఆర్ఎస్, ఈఎండీ, సేఫ్టీ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. యాజమాన్య వైఖరికి నిరసనగా ఈ నెల 29, 30 తేదీల్లో సమ్మె చేపడుతున్నామని, కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

రోజుకో ఉత్తర్వుతో కార్మికుల్లో ఆందోళన



స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోఫ్తీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: రోజుకో ఉత్తర్వు జారీ చేయడం ద్వారా యాజమాన్యం కార్మికులను భయాందోళనకు గురిచేస్తోందని స్టీల్ సీఐటీయూ నాయకులు తెలిపారు. దీనిని మానుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్తీను యూనియన్ నాయకులు సోమవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఉక్కు మంత్రిత్వశాఖ పార్లమెంట్ సాక్షిగా 5 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రకటించిందన్నారు. వాటిని భర్తీ చేయకుండా కార్మికులపై పనిభారాన్ని పెంచుతున్నారన్నారు. గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ పేరుతో విధుల నుంచి తొలగిస్తామని చెప్పడం అర్థం లేని చర్య అన్నారు. ఏకపక్ష నిర్ణయాల ద్వారా యాజమాన్యం కార్మికులపై క్రమశిక్షణ పేరుతో తీసుకునే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ ఈ విషయాలను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, కర్రా ప్రకాశ్, సన్యాసిరావు పాల్గొన్నారు.